

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

28 అక్టోబర్ 2025 పేజీలు : 08 మంగళవారం


జిల్లా పరిషత్ అధికారుల సేవలు

# ప్రశంసనీయం

- 38 మండలాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్న అధికారుల పనితీరు భేష్
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

మొంథా తుఫాను హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా జిల్లా ప్రజాపరిషత్ సీఈవో మోహన్‌రావు ఆధ్వర్యంలో ఎంపీడీవోలు, సిబ్బంది అన్ని ముందస్తు చర్యలు తీసుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా 38 మండలాల్లోని గ్రామాల ప్రజలకు సేవలు అందిస్తున్నారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల కొనియాడారు. ప్రస్తుత మొంథా తుఫాను హెచ్చరిక నేపథ్యంలో గత తుఫాను అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలలో భాగంగా ఈసారి మరింత సమగ్ర ప్రణాళికలతో అధికారులు తుఫాన్‌కు ముందుగానే సిద్ధమయ్యారు. జిల్లాలోని 38 మండలాలలో వర్షపు నీరు నిలిచే 135 లోతట్టు ప్రాంతాలను గుర్తించి, అందులో 119 లోతట్టు ప్రాంతాలలో నిల్వయున్న వర్షపు నీటిని 78 జేసీబీలను ఉపయోగించి రూ.11.49 లక్షల వ్యయంతో 77 పనులను పూర్తి చేశారు. రాబోవు మొంథా తుఫాను సందర్భముగా సదరు లోతట్టు ప్రాంతాలలో -మిగతా 6లో

మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో.. అధికారులు

# అందుబాటులో ఉండాలి

- ముంపుకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను గుర్తించి సహాయ శిబిరాలు ఏర్పాటు చేయండి
- సహాయ శిబిరాల్లో ఆహారం, నీరు సిద్ధంగా ఉంచండి
- ఆకస్మిక వరదలు వస్తే పెన్నానది పొర్లుకట్టలు, చెరువు గట్లు తెగే ప్రమాదం ఉన్నందున ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలి
- ముందస్తు చర్యలపై అధికారులు, నాయకులకు సూచనలు అందిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



నెల్లూరు అర్బన్, మేజర్‌న్యూస్ :

మొంథా తుపాను తీరం దాటే వరకు తీర ప్రాంత మత్స్యకారులు, పెన్నానది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. తుఫాను తీవ్రత నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకుంటూ చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులు, నాయకులకు సూచనలు సలహాలు అందిస్తున్నారు. తుఫాను తీరందాటే సందర్భంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అందుబాటులో ఉండి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ముంపుకు -మిగతా 2లో

కండలేరుకు పొంచి ఉన్న

# వరద ముప్పు



వివరాలు 2లో

- స్పిల్ వే దిగువన యుద్ధప్రాతిపదికన పనులు
- ఆరు ప్రొక్లెయిన్లతో వాగుల్లో పూడిక, చెట్లు తొలగింపు
- ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాం
- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ముందస్తు నివారణ చర్యలతోనే మొంథా తుఫాను

# నష్టాన్ని నివారించగలం



అధికారులకు సూచనలు చేసిన జిల్లా ప్రత్యేక అధికారి యువరాజ్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :

ముందస్తు నివారణ చర్యలతోనే మొంథా తుఫాను నష్టాన్ని నివారించగలమని, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని తుఫాను జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి తుఫాన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన అప్రమత్తత చర్యలపై జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుఫాన్ ప్రభావం ఎలాగైనా ఉండొచ్చని, ముందస్తు జాగ్రత్త చర్యలతోనే నష్టనివారణ సాధ్యమన్నారు. ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, -మిగతా 2లో

# తెలుగుదేశం పార్టీ అన్నివిధాలా సహకరించింది

- కొందరి వల్ల తాము ఇబ్బందిపడ్డాం
- మాలేపాటి రవీంద్ర నాయుడు



కావలి, మేజర్‌న్యూస్ :

కావలి నియోజకవర్గం దగదర్తి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, రాష్ట్ర ఆగ్రో కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, దగదర్తి మండలం తెలుగు యువత నాయకుడు మాలేపాటి భానుచందర్ నాయుడు ఇటీవల మృతి చెందారు. వారు చనిపోవడంతో రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ, దగదర్తి మండలంలోనూ తెలుగుదేశం పార్టీ అభిమానుల మనసును కలచివేసింది. దగదర్తి మండలంలోని ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఇప్పటికీ పరామర్శించడానికి వచ్చినప్పుడు వారు కన్నీటి పర్వంతమయ్యారు. ఇరిగేషన్ బోర్డు మాజీ చైర్మన్ మాలేపాటి రవీంద్రనాయుడు **'సూర్య ప్రతినిధి'**తో మాట్లాడుతూ.. ఇటీవల కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలైతే నమ్మతగినవి కావని, తమకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, -మిగతా 2లో

# ప్రజలు ఫోన్ చేసిన వెంటనే స్పందించాలి

## నెల్లూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను పరిశీలించిన జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** మొంథా తుఫాను నేపథ్యంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు సహాయం కోసం ప్రజలు ఫోన్ చేసిన వెంటనే స్పందించాలని.. కంట్రోల్ రూమ్ లో పనిచేస్తున్న సిబ్బందిని జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ ఆదేశించారు. సోమవారం మొంథా తుఫాన్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లాకు నియమించిన ప్రత్యేకాధికారి యువరాజ్ అధికారులతో సమీక్షాసమావేశానికి ముందు ప్రజలకు సహాయం అందించేందుకు నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సహాయం కోసం ప్రజలు ఫోన్ చేసిన వెంటనే స్పందించాలని, సమస్యను పూర్తిగా తెలుసుకుని సంబంధిత అధికారులకు తక్షణమే సమాచారం అందించాలని సిబ్బందికి సూచించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ.. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూంతో పాటు కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని.. భారీవర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారాన్ని ఆయా రెవెన్యూ డివిజన్ల కంట్రోల్ రూమ్ నెంబర్లకు కాల్ చేసి తెలుసుకోవచ్చని ప్రజలకు సూచించామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రత్యేక అధికారి యువరాజ్‌కు తెలిపారు.

### రెవెన్యూ డివిజన్ల వారీగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్లు

**నెల్లూరు జిల్లా కలెక్టరేట్ కంట్రోలు రూం నెంబర్లు** : 0861-2331261, 7995576699,
**కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, :** 7601002776,
**ఆర్డీవో కార్యాలయం, నెల్లూరు** : 9849904061,
**ఆర్డీవో కార్యాలయం, ఆత్మకూరు:** 9100948215,
**ఆర్డీవో కార్యాలయం, కావలి :** 7702267559

# కండలేరుకు పొంచి ఉన్న వరద ముప్పు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మొంథా తుఫాన్ నేపథ్యంలో కండలేరు జలాశయానికి వరద ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు మండలం పులికల్లు పంచాయతీ పర్వతాపురం వద్ద వాగులో పూడికతీత పనులను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. జలాశయం ఇప్పటికే నిండుకుండలా ఉందని, వర్షాలతో జలాశయంలోకి వరద ప్రవాహం పెరిగితే స్పిల్‌వే గేట్లు తెరవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. గేట్లు తెరిస్తే వరద నీటి ప్రవాహం పర్వతాపురం, పులికల్లు, అంకుపల్లి, వావింటపర్తి మీదుగా వెళ్లి కండలేరు వాగులో కలుస్తాయని తెలిపారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో నాలుగు రోజుల కిందటే కండలేరు స్పిల్ వేను పరిశీలించి ఇక్కడి పరిస్థితిని కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వివరించడం జరిగిందన్నారు. కలెక్టర్ అప్రమత్తమై ఆరు ప్రొక్లెయిన్లు పెట్టి వరద నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టారని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ సమస్యలను ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇరిగేషన్ శాఖను మూతవేసి ప్రజాప్రయోజనాలను గాలికొదిలేశారన్నారు. కండలేరు స్పిల్ వే నుంచి 50 వేల క్యూసెక్కులు నీటిని దిగువకు వదిలితే గ్రామాలకు ముప్పు ప్రమాదం పొంచివుందన్నారు. స్పిల్ వే దగ్గర నుంచి కండలేరు వాగు వరకు ప్రవాహం సాఫీగా సాగేందుకు అవసరమైన పనులు చేపట్టేందుకు రూ.95 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని వివరించారు. నిధులు మంజూరైతే వాగులను వెడల్పు చేయడంతో పాటు అవసరమైన స్ట్రక్చర్ నిర్మాణాలు చేపడతారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఈ పనులను కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడిన అంశాన్ని కూడా వైసీపీ హయాంలో నిర్లక్ష్యం చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారులను ఎక్కడిక్కడ అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. తుఫాన్ నేపథ్యంలో అధికారులతో పాటు టీడీపీ నాయకులు, కేడర్ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో నేపథ్యంలో తను ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. దారి పొడవున మొగళ్లూరు, అంకుపల్లి, పులికల్లు గ్రామాల ప్రజలను పలకరించి వారి యోగ క్షేమాలను వాకబు చేశారు. కార్యక్రమంలో పొదలకూరు మండల టిడిపి అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, మండల తెలుగు యువత అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ కోదూరు పెంచల భాస్కర్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ అక్కెమ్ సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు పులిపాటి వెంకటరత్నం నాయుడు, ఓబుల్ రెడ్డి, రావుల సంపత్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ముందస్తు నివారణ చర్యలతోనే.. మొంథా తుఫాను నష్టాన్ని నివారించగలం

*(మొదటి పేజీ తరువాయి)*

ఆర్‌డబ్ల్యుఎస్, మెడికల్ అండ్ హెల్త్, ఐసిడిఎస్ శాఖల అధికారులు, సిబ్బంది చాలా అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వపరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ.. జిల్లాలో తుఫాను నుంచి ప్రజలను రక్షించేందుకు ఎన్‌డిఆర్ఎఫ్ ఒకటి, ఎస్‌డిఆర్ఎఫ్ ఒక బృందాన్ని సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. ప్రజలకు సహాయం అందించేందుకు 24 గంటలు పనిచేసేలా కంట్రోలు రూంను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 0861-2331261, 7995576699 నెంబర్లలో ప్రజలు సహాయం కోసం ఫోన్ చేయాలని సూచించారు. జిల్లాలో 9 తీర మండలాలు ఉండగా, వీటిలో 42 సెన్సిటివ్ గ్రామాలు, 166 హాబిటేషన్లు గుర్తించామన్నారు. తుఫాన్ ప్రభావం సమయంలో ప్రజలకు సురక్షిత ఆశ్రయం కల్పించేందుకు 144 రిలీఫ్ సెంటర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. అవసరమైతే ఈ రిలీఫ్ కేంద్రాలను ఉపయోగించుకుంటామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా 377 చౌక దుకాణాలతో రిలీఫ్ సెంటర్లను అనుసంధానించి, అవసరమైన పిడిఎస్ బియ్యం సరఫరా దాదాపు పూర్తయిందని తెలిపారు. పెన్నానది పరివాహక సమీప ప్రాంతాల్లో వరదలు ప్రభావం చూపే 40 సున్నిత ప్రదేశాలను గుర్తించి తాత్కాలిక మరమ్మత్తు పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. తుఫాన్ ప్రభావ సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు తీసుకుందని, ఎటువంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్ఓ విజయ్‌కుమార్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన విజయకుమార్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లా రెవెన్యూ అధికారిగా ఎన్.విజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం కలెక్టరేట్‌లోని డిఆర్ఓ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన విజయ్ కుమార్ ను కలెక్టరేట్ పరిపాలన అధికారి తుమ్మా విజయ్‌కుమార్ పుష్ప గుచ్ఛం అందించి అభినందించారు.

## నేడు పాఠశాలలకు, జూనియర్ కళాశాలకు సెలవు

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** 'మొంథా' తుఫాను నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈనెల 28న (మంగళవారం) అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్వాడీ పాఠశాలలకు, అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తర్వులను అన్ని రకాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విధిగా అమలుచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## టీడీపీ అన్నివిధాలా సహకరించింది



*(మొదటి పేజీ తరువాయి)*

మంత్రి నారా లోకేష్ బలం ఉండబట్టే.. తాము నేటికీ ఎన్ని అవమానాలు, ఎన్ని సమస్యలు ఎదురైనప్పటికీ వాటిని ఎదుర్కొని నిలబడి గలిగామని తెలిపారు. అలాగే కావలి నియోజకవర్గంలో జరిగిన పరిణామాలు కొంత మంది తన కుటుంబంపై విమర్శలు చేయడం, అది సరైన పద్ధతి కాదని, అలాగే ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్‌తో చెప్పడం కూడా జరిగిందని, అలాగే జిల్లా తెలుగుదేశం పార్టీతో కూడా కొన్ని విషయాలు చర్చించడం జరిగిందని తెలిపారు. అలాగే గురువారం (30వ తేదీన) నా తమ్ముడు మాలేపాటి సుబ్బానాయుడు, నా తనయుడు భానుచందర్ నాయుడు వారి ఉత్తరక్రియలు మా స్వగృహంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావలి నియోజకవర్గం ప్రజలు అందరూ హాజరైతే వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని, తప్పక అందరూ హాజరు కావాలని కోరారు. మా కుటుంబానికి జరిగిన నష్టం జరిగిపోయిందని, దాని గురించి దేవుడు చూసుకుంటాడని, అంతేకానీ మాకు తెలుగుదేశం పార్టీ కొండంత అండగా ఉందన్నారు. అవేవో సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు, కొన్ని పత్రికల్లో ప్రచురించిన కథనాలను తేల్చి కొట్టిపారేశారు. దగదర్తి మండలం మెయిన్‌బజారు సెంటర్లో స్వర్గీయ మాలేపాటి సుబ్బానాయుడు, మాలేపాటి భానుచందర్ నాయుడు కాంస్యం విగ్రహాలను పెట్టేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండాలి

*(మొదటి పేజీ తరువాయి)*

గురయ్యే లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైతే ప్రజలను సహాయ శిబిరాలకు తరలించాలని సూచించారు. వివిధ శాఖల సమన్వయంతో ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలని కోరారు. సహాయ శిబిరాల్లో ఆహారం, నీరు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయంగా జనరేటర్లు సిద్ధం చేసి ఉంచుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యశాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వస్తే పెన్నానది పొర్లు కట్టలు, చెరువు గట్లకు గండ్లు పడే ప్రమాదం ఉన్నందున ఇసుక బస్తాలు సిద్ధం చేసి ఉంచుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూటమి నాయకులు సహాయ చర్యలకు సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే సూచించారు. తుఫాను నేపథ్యంలో తీర ప్రాంత, పెన్నా పరివాహక గ్రామాల ప్రజల భద్రత కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, ఎవరు ఆందోళన చెందవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు అధికారులతో సంప్రదిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారన్నారు. తుఫాన్ ముప్పు ఎదుర్కోవడానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అత్యవసర సహాయం కోసం కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్ 0861-2331261, 7995576699 సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు.

# మొంథా తుఫానుపై ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం

## యూరియా విషయంలో ఏ ఒక్క రైతు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు






**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నెల్లూరు రూరల్ మండలం అధ్యక్షులు బూడిద విజయకుమార్ అధ్యక్షతన మొంథా తుఫాన్‌కు తీసుకోవలసిన జాగ్రత్త చర్యలు, రైతులకు యూరియా పంపిణీ పై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నెల్లూరు రూరల్ మండలంలో మొంథా తుఫాన్ పై అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం ఎటువంటి సమస్య ఉన్న ఎప్పుడూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. అలాగే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రైతు పక్షపాత ప్రభుత్వంగా ఉంటూ, ఎక్కడ కూడా యూరియా కొరత లేకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతి రైతుకు యూరియాను అందచేస్తున్నారు. అదేవిధంగా ప్రతి రైతుకు యూరియా అందించడమే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి లక్ష్యం అని తెలియజేశారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దు ప్రతి రైతుకు సరిపడా యూరియా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ మండల ముఖ్యనాయకులు, నెల్లూరు రూరల్ మండల రెవెన్యూ అధికారి, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి, డీటీ, మండల అగ్రికల్చర్ ఆఫీసర్, ఎలక్ట్రికల్ ఏడీ, ఏఈలు, ఇరిగేషన్ ఏఈ, పంచాయతీ రాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

### బస్సు ప్రమాదంలో అగ్నికి ఆహుతైన

# మృతదేహాలు గోల్లవారిపల్లికి చేరిక

- ఆర్తనాదాలతో తల్లడిల్లిన గ్రామం
- బోరున విలపించిన కుటుంబ సభ్యులు
- శోకసముద్రంలో గోళ్ల వారిపల్లె



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో మండలానికి చెందిన గోళ్లవారిపల్లె గ్రామానివి చెందిన ఒకే కుటుంబ సభ్యులు అగ్నికి ఆహుతి అయిన విషయం తెలిసిందే బాగా వారి పార్థివదేహాలు గ్రామానికి చేరుకున్నాయి. దీంతో ఒక్కసారిగా ఆర్తనాధాలతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారిని పట్టుకొని బోరున విలపించారు. కర్నూలు బస్సు ప్రమాదంలో అగ్నికి ఆహుతైన మృతదేహాలు గోళ్ల వారిపల్లెకు చేరుకునే క్రమంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే వారి నివాసానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు జరిగిన పరిణామాలను వివరిస్తూ బోరున విలపించారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. గోళ్ల వారిపల్లె గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది. గ్రామానికి పార్థివ దేహాలు చేరుకోవడంతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అంత్యక్రియల ఏర్పాట్లకు అన్ని సిద్ధం చేసుకోవాలని, దానికి అవసరమైన ఖర్చులు మొత్తం నేనే భరిస్తానని, స్థానిక నాయకులతో తెలిపి ఏర్పాట్లను సిద్ధం చేయించారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి కుటుంబ పెద్దగా అన్నీ తానై ఎమ్మెల్యే చూసుకుంటున్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఎమ్మెల్యే దాతృత్వం మరువరానిదని, చుట్టపు చూపుగా కాకుండా, ప్రేమ అభిమానాలు చూపుతూ, బాధలో కుటుంబానికి అండగా నిలిచిన తీరుపై రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసిస్తున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు అంత్యక్రియలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ గూడా నర్సా రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు, చాకలి కొండ, గోళ్ల వారిపల్లె నాయకులు బంధు మిత్రులు తదితరులు ఉన్నారు.

# వర్షం వస్తే ఉరుపు.. అక్కడక్కడ స్లాబ్‌కు పగుళ్లు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** వర్షం వస్తే ఉరుపు.. అక్కడక్కడ స్లాబ్‌కు పగుళ్లు ఉండడాన్ని మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ గుర్తించారు. సోమవారం ఆయన తుఫాను ప్రభావం సందర్భంగా ఈ కళాశాలను సందర్శించారు. ఐదో తరగతి నుంచి 8వ తరగతి వరకు ఉన్నటువంటి బాలికల వసతిగృహం వర్షం వస్తే అధ్వానంగా ఉంటుందని విద్యార్థినీలు తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని మండల టిడిపి అధ్యక్షులు పేర్కొన్నారు. స్లాబ్‌కు మరమ్మత్తులు చేపట్టే విధంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని టీడీపీ అధ్యక్షులు నీలం పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కళాశాల అధ్యాపకులు మీడియాతో మాట్లాడారు. అదాని ఫౌండేషన్ ద్వారా కళాశాలకు మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసి ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు బోలిగర్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు గుంజి శ్రీనివాసులు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# కోర్టులో.. చాయ్ విత్ అంకన్న



**నెల్లూరు లీగల్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ తన జనసైనికులలో స్ఫూర్తినింపేందుకు చాయ్ విత్ జనసైనిక్స్ అనే వినూత్న కార్యక్రమం చేపట్టి జనసైనికులను వీర మహిళలను ప్రాంతాలవారీగా ప్రతిరోజు కలుసుకుంటూ వారిలో ఉత్సాహం ఊపు నింపే ఆలోచన చేసింది. అందులో భాగంగా నెల్లూరు నగరంలో జనసేన నాయకుడు గునుకుల కిషోర్ చాయ్ విత్ జనసైనిక్స్ అనే కార్యక్రమాన్ని నిర్విరామంగా నడుపుతున్నారు ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని రానున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో పోటీలో ఉన్న సీనియర్ న్యాయవాది సత్తు అంకయ్య అభిమానులు తమ ప్రచారంలో భాగంగా చాయ్ విత్ అంకన్న అనే వినూత్న ప్రచారాన్ని జిల్లా కోర్టు ప్రాంగణంలో చేపట్టారు అందులో భాగంగా సోమవారం మధ్యాహ్నం న్యాయవాదులందరూ కోర్టు క్యాంటీన్లో సమావేశమై చాయ్ విత్ అంకన్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయవాది అంకయ్య మాట్లాడుతూ తాను ప్రాక్టీస్ లోకి వచ్చినప్పటి నుండి ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నెల్లూరు జిల్లా శాఖలో కీలకంగా పని చేశానని సీనియర్ల సహకారంతో జూనియర్ల ప్రోత్సాహంతో అనేక న్యాయవాద సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని పేర్కొన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ తరపున రానున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో తాను పోటీ చేస్తున్నానని తన గెలుపుకు ప్రతి న్యాయవాది సహకరించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జి.బాలసుబ్రమణ్యం చుక్కా రమేష్ పి.విజయ మోహన్ రెడ్డి సాయి రేఖా రాణి సురేఖ లక్ష్మి తదితర న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వినూత్న కార్యక్రమం పట్ల న్యాయవాదులు హర్షం వెలిబుచ్చారు.

# చిన్నక్రాక వద్ద రోడ్డు ప్రమాదం

## టైర్ పంచరై కల్వర్టు ఢీకొన్న కారు, ఐదుగురికి తీవ్ర గాయాలు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం చిన్న క్రాక గ్రామం వద్ద కారు ప్రమాదం జరిగింది. కర్నూలు బస్సు ప్రమాద బాధితుల అంత్యక్రియలకు వింజమురుకు వెళ్లి తిరిగి వస్తున్న కుటుంబ సభ్యులకు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో విజయవాడకు చెందిన మొత్తం ఐదుగురు గాయపడ్డారు. వీరిలో సుమలత తలకు బలమైన గాయం కావడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మౌనిక, కృష్ణ, కృష్ణ చైతన్య, మరో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే 108 ద్వారా కావలిలోని వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు విచారణ దర్యాప్తు చేస్తున్నారు.

# దూసుకొస్తున్న మొంథా తుఫాన్

## ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు

**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి. అది మొంథా తుఫాన్‌గా మారినది ఆంధ్రప్రదేశ్‌కి రెడ్ అలెర్ట్‌ను ప్రకటించడం జరిగింది ఏదో ఒక చోట తీరం దాటే అవకాశం ఉందందున 28, 29 తేదీల్లో చాలా కీలకమైన రోజులు కావున 28 అర్ధరాత్రి లేదా 29 తెల్లవారుజామున సమయంలో తీరని దాటే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంతాల ప్రజలు దగ్గర్లో ఉన్న స్కూల్స్ గాని తుఫాన్ షెల్టర్‌లలో గాని ఉండాలని తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని తెలిపారు.

# వీఎస్‌యూలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో ఈరోజు (27.10.2025) మూడవ, ఐదవ సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ) డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో మొత్తం 15,361 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 14,282 మంది హాజరయ్యారు. 1,079 మంది గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. గూడూరు (డి ఆర్ డబ్ల్యూ) డిగ్రీ కాలేజీలో ఒక విద్యార్థిని డీబార్ చేసినట్లు పరీక్షల నిర్వాహణాధికారిణి డా. ఆర్.మధుమతి తెలిపారు.

# సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ధ్యేయం

## ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ధ్యేయమని నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్లో గ్యారేజీ, బస్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు బీజేపీ నాయకులు ముడమాల రమేష్‌రెడ్డి సమకూర్చిన రైన్ కోట్లు, యూనిఫాంలు పంపిణీ చేశారు అనంతరం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూల్లో ప్రైవేటు ట్రావెల్ బస్సు 120 కిలోమీటర్ల వేగంతో వెళ్లి 20 మంది ప్రయాణికులను అగ్నికి ఆహుతి చేయడం బాధాకరమన్నారు. అలాంటి సంఘటనలు ఆర్టీసీ జరగవన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ కలిగిన సంస్థ ఆర్టీసీ అన్నారు. త్వరలో ఆర్టీసీ ద్వారా ప్రభుత్వం 1,500 బస్సులు కొనుగోలు చేయనుందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రికల్ ఏసీ బస్సులు 1,350 కొనుగోలుకు అవసరమైన సబ్సిడీని సైతం అందజేసిందని, అందుబాటులోకి వచ్చిందన్నారు. వీటితోపాటు మరో 3 వేల మంది సిబ్బంది అవసరమరని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు, ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఆర్టీసీ ఆస్తులను పరిరక్షించడంతోపాటు ప్రయాణికుల సౌకార్యర్థం బస్టేషన్లలో వసతుల కల్పనకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. అనంతరం కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రమేష్ కుమార్, సీఐ నాగభూషణం, బీజేపీ నాయకులు కదిరి రంగారావు మేకపాటి మాల్యాద్రినాయుడు నెల్లూరు వెంకటస్వామి, ఆవుల రోశయ్య, జీ.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్, కార్యాలయ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పాత వెల్లంటి, కొత్త వెల్లంటిలో రచ్చబండ కార్యక్రమం

## కోటి సంతకాలతో నవంబర్ 22న రాష్ట్ర గవర్నర్‌కి అందజేత : ఆనం





**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నుండి గ్రామస్థాయి వరకు 45 రోజులపాటు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని నెల్లూరు రూరల్ మండలం పాత వెల్లంటి, కొత్త వెల్లంటి గ్రామం నందు రచ్చబండ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రజా ఉద్యమం సంతకాల సేకరణ కార్యక్రమం నెల్లూరు రూరల్ మండలం నాయకులు, కార్యకర్తలతో కలిసి సేకరించడం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమంలో ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 8వేల కోట్ల రూపాయలు ఖర్చు అయ్యేటు వంటి పరిస్థితుల్లో 3వేల కోట్ల రూపాయలతో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను శంకుస్థాపన చేయడం జరిగింది. అందులో 5మెడికల్ కళాశాలలో పూర్తిస్థాయిలో ప్రారంభించడం జరిగింది. ఒక మెడికల్ కళాశాల అధ్యాపకుల నియమించకపోవడం వలన ప్రారంభం కాలేదు. మిగిలిన 11 మెడికల్ కళాశాలలో వివిధ దశల్లో నిర్మాణం జరుగుతూ ఉన్నాయి. ప్రస్తుతం ఈ కూటమి ప్రభుత్వం ఈ 17 మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం చాలా దారుణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గం అనుబంధ సంఘాల అధ్యక్షులు, నెల్లూరు రూరల్ మండల పాత వెల్లంటి, కొత్త వెల్లంటి గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేస్తాం..

## సొసైటీ చైర్మన్ కరియావుల అప్పలనాయుడు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో మండలంలోని రైతులందరికీ సకాలంలో యూరియా సరఫరా చేస్తామని జలదంకి మండలం సొసైటీ చైర్మన్ కరియావుల అప్పలనాయుడు తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన జలదంకి లోని స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వింజమూరు ఏడిఏ శేషగిరి రావు, జలదంకి వ్యవసాయ శాఖ అధికారి శ్రీవాణి లతో కలిసి అప్పలనాయుడు రైతులు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ కరియావుల అప్పలనాయుడు మాట్లాడుతూ.. మండలంలోని రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రతి ఒక్కరికి అందజేస్తాను తెలిపారు. యూరియా సరఫరా అందదు అనే ఆపోహాలు విడాలని తెలిపారు. అధికారులకు అక్రమ అమ్మకాలు గురించి తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపి మండల అధ్యక్షులు పులుగుంట మధు మోహన్ రెడ్డి, మండల యువత అధ్యక్షులు మునగాల తిరుముల రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు ముచ్చలా మధుసూదన్ రెడ్డి, షేక్ జానీ, నాయకులు కూరపాటి మాలకొండా రెడ్డి (చిన్న), కోల్లా రాధాకృష్ణ, గంటా అశోక్ జనసేన నాయకులు నిమ్మలపల్లి రామ్ చైతన్య, తోట మురళి, బిజెపి నాయకులు వద్దే శ్రీనాథ్ రెడ్డి, ముడి కిషోర్ రెడ్డి, నాయకులు, రైతులు, డీలర్లు, అధికారులు, పాల్గొన్నారు.

# ఘనంగా ఆరాణి సిల్వర్ జ్యువెలరీ ప్రారంభం



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని స్థానిక మాగుంట లేఔట్‌లో ఆరాణి ప్రీమియం సిల్వర్ జ్యువెలరీ షోరూమ్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లు హాజరయ్యారు ఈ సందర్భంగా నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా చక్కటి డిజైన్లతో షోరూమ్‌ను ఏర్పాటు చేశారని అభినందించారు. ఈ సందర్భంగా పలువురు బంధుమిత్రులు, సన్నిహితులు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ నేత శాంతి లాల్ జైన్‌తో షోరూం నిర్వాహకులు కమలేష్ జైన్, రింకు జైన్, భరత్ జైన్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# పాఠశాలలకు రూటర్స్ పంపిణీ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో టీ.వెంకటేశ్వర్లు ఆయా పాఠశాలల ఉపాద్యాయులకు రూటర్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ పాఠశాలలో అయితే స్మార్ట్ టీవీలు, ఐఎఫ్పీ ప్యానెల్స్ ఉన్నాయో ఆయా పాఠశాలలకు రూటర్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. జియో సిమ్ నెట్వర్కుతో మండలో మొత్తం 34 పాఠశాలలకు జియో సిమ్ కూడిన రూటర్స్ పంపిణీ చేశామన్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

# గిరిజనులకు చట్టాలపై అవగాహన



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో సోమవారం పింకుల్ ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో గిరిజనులకు న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. కావలి మండల న్యాయ అధికారి సంస్థ చైర్మన్ ఏ.గీత వాణి ఆదేశాల మేరకు కావలి మండల లీగల్ ఎయిడెడ్ మెంబర్, న్యాయవాది ఐ.సాయిప్రసాద్ ఆధ్వర్యంలో గిరిజనులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు వలన బాలికల్లో వచ్చే ఆరోగ్య సమస్యలు, కుటుంబాల్లో అవగాహన లోపాలు సంభవిస్తాయని, కాబట్టి ప్రభుత్వం వారు నిర్దేశించిన కనిష్ట వివాహ వయసు 18 సంవత్సరాలు అని బడి ఈడు పిల్లల బడిలో ఉండాలని బాల కార్మికులు చట్టాలు, వివిధ అంశాలపై వారికి అవగాహన కల్పించారు. అలాగే కాలనీలో ఉన్న గిరిజన పిల్లలు అందరూ బడికి పంపాలని సమాజంలో గౌరవంగా జీవించాలని న్యాయవాది సాయి ప్రసాద్ తెలిపారు. చిన్న పిల్లలు ఉంటే అంగన్వాడి కేంద్రాలు ఏర్పాటు చేయాలని కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

# గోళ్ల రమేష్ కడసారి వీడ్కోలు..



- కన్నీరు పెట్టుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్
- పార్థివ దేహాలకు, పూలమాలవేసి ఘన నివాళి
- అన్ని విధాల ఆదుకుంటా, భరోసా కల్పించిన ఎమ్మెల్యే

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** కర్నూలు బస్సు ప్రమాదంలో అగ్నికి ఆహుతైన వింజమూరు మండలం గోళ్లవారిపల్లి గ్రామానికి చెందిన, గోళ్ల రమేష్ అనూష శశాంత్ మన్విత్ అంతిమయాత్రలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కాలినడకన పాల్గొని కడసారి వీడ్కోలు పలికారు. సోమవారం జరిగిన అంత్యక్రియలకు ముందు, పార్థివ మృతదేహాలకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ప్రమాదం జరిగిన రోజు గోళ్ల వారిపల్లె గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆరోజు రాత్రి వరకు అక్కడే ఉన్నారు. ప్రమాదఘటన తెలుసుకుంటూ, మృతదేహాలను తీసుకొచ్చేందుకు కృషి చేశారు. మూడు రోజులపాటు, అన్ని తానై ఎమ్మెల్యే చూసుకున్నారు. ఆదివారం రాత్రి ప్రత్యేక అంబులెన్స్ ద్వారా వచ్చిన మృతదేహాలకు, ఐస్ బాక్స్ లో ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు నుండి చివరి వరకు అన్నీ ఖర్చులు ఎమ్మెల్యే భరించారు. శోకసముద్రంలో ఉన్న కుటుంబానికి ధైర్యాన్ని చెపుతూ, ఎన్డీఏ కూటమి నాయకులు, గ్రామస్తులు, బంధుమిత్రులను, సమాయత్తపరిచి ఘనంగా అంత్యక్రియల్లో కాకర్ల పాల్గొన్నారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి ఆపద్బాంధవుడు, ఆత్మబంధువుగా నిలిచారు. గోళ్ల రమేష్ కుటుంబానికి కడసారి కన్నీటి వీడ్కోలు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇలాంటి కష్టం ఎవరికి రాకూడదని, కష్టకాలంలో వారి కుటుంబానికి అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. గోళ్ల మాలకొండయ్య, కుటుంబానికి 10లక్షల రూపాయలు ప్రభుత్వం ద్వారా అందించడం జరిగిందన్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వారి నివాసానికి కుటుంబ సభ్యులను పరామర్శించి, విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఐదు లక్షలు, కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నేను ఒక మూడు లక్షలు, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, వారి కుటుంబాన్ని పరామర్శించి శ్రీస్వర్ణ భారతి ట్రస్ట్ ద్వారా లక్ష రూపాయలు అందించడం జరిగిందన్నారు. ఇవి కాకుండా బస్సు ఇన్సూరెన్స్, వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని, అవి కూడా తొందరలోనే అందుతాయి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల్లో ఎక్స్గ్రేషియా అందించడం జరుగుతుందన్నారు.



ఆర్థికపరంగా, భరోసా ఉన్నప్పటికీ, వారిని అన్ని విధాల ఆదుకునే బాధ్యత ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తీసుకుంటున్నట్లు తెలిపారు. మృతి చెందిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రత్యేకంగా పోలీస్ వారికి మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అంతిమయాత్రలో మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, ఎంపీపీ ఇనగనూరి మోహన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్ల యాదవ్, పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాస్ యాదవ్, మాజీ సొసైటీ అధ్యక్షులు జూపల్లి రాజారావు,కే శ్రీనివాసులు నాయుడు, జనసేన మండల అధ్యక్షులు బండారు సత్యనారాయణ,స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ స్టోన్ హౌస్ పేట మండల కమిటీ నియామకం

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** స్టోన్ హౌస్ పేట సోమవారం మండల కమిటీ నియామక కార్యక్రమం బిజెపి జిల్లా కార్యాలయం నందు మండల అధ్యక్షుడు కోసూరు వెంకట సుధీర్ ఆధ్వర్యంలో జరిగింది. పై కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శిపారెడ్డి వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ.. స్టోన్ హౌస్ పేట మండలంలో ఈరోజు నూతన బాధ్యతలు తీసుకున్న అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ స్టోన్ హౌస్ పేట మండలంలో రాబోవు కార్పొరేషన్ ఎలక్షన్లలో గెలిపించే దిశగా కష్టపడి పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ.. సోమవారం బాధ్యతలు తీసుకున్న అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ మీరు రాబోవు రోజుల్లో కష్టపడి పనిచేసి పార్టీలో ఉన్నత పదవులు తీసుకోవాలని కోరారు. ఈరోజు మీ అందరికీ నియామకం పత్రాలు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా ఉపాధ్యక్షులు పొట్లూరు శ్రీనివాసులు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్, బిజెపి



జిల్లా కార్యదర్శి మేడేపల్లి రత్నం నాయుడు, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వి.హర్షవర్ధన్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు పైడిమాని ఆదినారాయణ, మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు లాల్ ఖాజా మస్తాన్, బిజెపి సీనియర్ నాయకులు ఎర్రమల్లి హరికృష్ణ, నూతన బాధ్యతలు తీసుకున్న కమిటీ నాయకులు స్టోన్ హౌస్ పేట మండల ఉపాధ్యక్షులు వార్త వెంకటేశ్వర్లు, నటుకుల కిషోర్, బుజ్జమ్మ, ఉచ్చూరు ముని మోహన్, చీమల దీన్నే లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి సురేష్ బాబు, భీమవరపు రాఘవేంద్ర, కార్యదర్శులు, ఓంకారం వెంకటేశ్వర్లు, గౌరీశెట్టి విద్య, నారపనేని శివ, మంచి కలపాటి నవీన్, భీమవరపు చిన్న రాఘవేంద్ర, బీజేపీ నాయకులు లక్కాకుల నరేష్, వడ్లమాని అశ్విని, మందా రవి, భీమవరపు రాదయ్య, ఎస్కే ఖాదర్ మస్తాన్, కుప్పిచెర్ల మనీ, వినోద్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఫ్లెక్సీలు, చిన్న లాలీపాప్‌ల ఏర్పాటును పూర్తిస్థాయిలో నిషేధించి ఉన్నామని, అనుమతులు లేకుండా ఎవరైనా ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వై.ఓ నందన్ హెచ్చరించారు. పట్టణ పురపాలక శాఖమంత్రి పి.నారాయణ, రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిల సంయుక్త ఆలోచనలతో ఫ్లెక్సీ ఫ్రీ/ పోస్టర్ ఫ్రీ సిటీ నిర్మాణానికి ప్రణాళికలను రూపొందించి పటిష్టంగా అమలు చేయనున్నామని కమిషనర్ తెలిపారు. నగర సుందరీకరణకు అవరోధంగా డివైడర్ల మధ్యలో అనధికారికంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయరాదని, నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడైనా ఫ్లెక్సీల ఏర్పాటుకు కార్పొరేషన్ అనుమతులు తప్పనిసరి అని కమిషనర్ స్పష్టం చేశారు. అనుమతులు పొందిన ఫ్లెక్సీలు కూడా 48 గంటలలోపే తొలగించేయాలని సూచించారు. అదేవిధంగా అనుమతులు లేకుండా గోడలపై పోస్టర్లను అంటించడం కూడా చట్ట వ్యతిరేకమని, కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఫ్లెక్సీలు ప్రింట్ చేసే ప్రింటర్ నిర్వాహకులు ముందస్తుగా కార్పొరేషన్ అనుమతులను పరిశీలించిన తర్వాతే ఫ్లెక్సీలు ముద్రించే పనులను చేపట్టాలని కమిషనర్ సూచించారు.

## వర్షపు నీరు సాఫీగా పోయే విధంగా చూడండి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక పొదలకూరు రోడ్డు రామకోటయ్య నగర్ ప్రాంతంలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది అన్న సమాచారం తెలుసుకుని సోమవారం ఆ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. వర్షపు నీరు డ్రైను కాలువల ద్వారా ప్రవహించేందుకు అవసరమైన పూడికతీత పనులను కమిషనర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కమిషనర్ ఆదేశాల మేరకు రోడ్డుపై చేరిన వరద నీరు ప్రవహించేందుకు డ్రైను కాలువను అనుసంధానిస్తూ రోడ్డు పక్కగా కాలువను తవ్వించి ప్రవాహం సాఫీగా జరిగేలా నూతనంగా డ్రైను మార్గం ఏర్పాటు చేశారు. నగరవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లపై వర్షపు నీరు నిలిచే వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కండలేరు స్పిల్ వే కాలువను అటవీ శాఖ అభ్యంతరం దారుణం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** డ్యాం రక్షణ కొరకు కాలువ నిర్మాణ వేగవంతం చేయాలని తెలుగు గంగ ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వర రావుకు బిజెపి నేత మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. అటవీ చట్టాలు పర్యావరణ పరిరక్షణ కోసం పని చేయాలి అవే చట్టాలు విధ్వంసానికి దారి తీయకూడదు కండలేరు స్పిల్ వే గేట్లు ఎత్తితే నాలుగు గ్రామాలు ముంపుకు గురవుతాయని ప్రజల ఆందోళన చెందుతున్నారు. వావింటపర్తి గ్రామ ప్రజలను పునరావాసానికి తరలిస్తున్నారు. అటవీ భూముల్లోనే కండలేరు జలాశయం నిర్మాణం జరిగింది అటవీ భూముల్లోనే రైల్వే లైన్ నిర్మాణం జరిగింది. వర్షపు నీరు అడవి లోనే ప్రవహిస్తుంది. ఆ నీటిని కాలువ ద్వారా వాగులోకి మళ్లించుకుంటే పర్యావరణ విధ్వంశం జరగదు. అటవీ శాఖ జంతువులకు ఇచ్చిన విలువ మానవాళికి ఇవ్వకపోవడం దుర్మార్గం. కండలేరు మిగులు జలాలు వలన గ్రామాలలో పంట నష్టం ఆస్తి నష్టం జరిగితే అటవీశాఖ బాధ్యత వహించాలి. కండలేరు డ్యామ్ రక్షణ కొరకు స్పిల్ వే నిర్మాణం జరిగిందని పాలకులు అధికారులు గుర్తు తెచ్చుకోవాలి. డ్యాం రక్షణ చర్యలు లో భాగంగా స్పిల్ వే కాలువ నిర్మాణం వేగవంతం చేయాలని ఎస్ఈకి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, బుధవరపు బాలాజీలు పాల్గొన్నారు.

# పెన్నా పొర్లు కట్టను పరిశీలించిన టీడీపీ నాయకులు కోటంరెడ్డి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పొట్టేపాలెం గ్రామం నందు పెన్నా పొర్లు కట్టను టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, ఇరిగేషన్ అధికారులతో కలసి టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పెన్నా నది ప్రవాహిత ప్రాంతాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు జిల్లా కలెక్టర్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ముందస్తుగా ప్రత్యేక చొరవ తీసుకొని, పెన్నా పొర్లు కట్టలను పటిష్టం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాలెం గ్రామం నందు పెన్నా పొర్లు కట్ట మరామ్మత్తు పనులు సాగుతున్నాయి. అలాగే వాతావరణ శాఖ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రానున్న భారీ వర్షాలు, ఎగువనున్న సోమశిల డ్యామ్ నుండి పెన్నానదికి వచ్చే వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని పొర్లు కట్టలు నిర్మాణాన్ని వేగవంతం చేస్తూ, తీర ప్రాంత లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇన్‌చార్జ్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, సర్పంచ్ ఏడుకొండలు, ఎంపీటీసీ నెరేళ్ళ నారాయణ, టీడీపీ నాయకులు సురేష్ రెడ్డి, సతీష్ రెడ్డి, అశోక్ రెడ్డి, శేషురెడ్డి, నరహరి రెడ్డి, జననీ బాబు, ముత్యాల సుబ్రమణ్యం, బాలకృష్ణ, ఫిరోజ్, రియాజ్, పెంచలయ్య, నరసయ్య, సుబ్రమణ్యం, అలియాస్, జంగం సురేష్, రాజశేఖర్, వెంకట రమణయ్య, నరసయ్య, శ్రీనాథ్, మల్లయ్య, నవాజ్, మల్లి, ఇరిగేషన్ ఏఈ బాలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఐక్య భవన్ ప్రథమ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయండి

**కావలి, మేజర్‌న్యూస్ :** బీసీ ఐక్యత ప్రథమ వార్షికోత్సవం జయప్రదం చేయాలని బిసి ఐక్యత పవన్ నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు అద్దంకి ప్రభాకర్ రావు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గోవిందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాయుడు పరిశుద్ధ రావు రాష్ట్ర సహాయక కార్యదర్శి కే.శ్రీనివాసులు కావలి రైల్వే రోడ్లో ఉన్న స్థానిక జర్నలిస్టు క్లబ్ కార్యాలయం నందు మీడియా సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. కావలి మెయిన్ రోడ్‌లో ఉన్న ఈడెన్ ఫంక్షన్ హాల్ నందు మంగళవారం బీసీ ఐక్యత భవన్ ప్రథమ వార్షికోత్సవం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాదయ్య జెడ్పి మాజీ చైర్మన్ చంచల బాబు యాదవ్ మరి కొంతమంది బీసీ ప్రముఖ నేతలు పాల్గొంటారని




తెలిపారు. ఈ కార్యక్రమానికి బీసీ నేతలతోపాటు బీసీ సోదరులు బడుగు బలహీన వర్గాల ప్రజలు మైనారిటీ సోదరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోరాల్సిన పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు రాజకీయాల్లో బీసీల రిజర్వేషన్ తదితర అంశాలపై జరుగుతుందని అలాగే నూతన కమిటీలు కూడా ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యత వ్యవస్థాపక అధ్యక్షులు చిన్ని వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏటీఎస్ కేంద్రంలో అక్రమ నగదు దోపిడీ




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని కప్పలదొరువు వద్ద ఉన్నటువంటి ఏటిఎస్ కేంద్రంలో కార్మిక రంగం నుంచి అక్రమ నగదు దోపిడీ చేస్తున్నారని సిఐటియు నాయకులు అంకయ్య ఆరోపించారు. సోమవారం జిల్లా సిఐటియు కమిటీ పిలుపుమేరకు ముత్తుకూరు మండలం సిఐటియు నాయకత్వం తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించింది. రవాణా రంగం కార్మికులకు నష్టం కలిగించే ఏటిఎస్ సెంటర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆటో కార్మిక సంఘం ఈ ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గడ్డం మాట్లాడారు. కార్మికుల నుంచి పెద్ద ఎత్తున అక్రమ నగదు వసూలు చేస్తున్నారని ఏటీఎస్ సెంటర్ యాజమాన్యంపై ఆయన ఆరోపించారు. వాహనాలు ఫిట్నెస్‌కి వెళ్ళినప్పుడు చిన్న చిన్న సమస్యలు వచ్చినప్పుడు సెన్సార్ పనిచేయడం లేదని చెబుతూ కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని దీంతో కార్మికులు వీధిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫిట్నెస్ కంటే అక్రమ పైసలు వసూలు ఎక్కువగా చేస్తున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఈ సెంటర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్కింగ్ సౌకర్యం లేనందువల్ల వాహనాలు రోడ్డుపైన నిలిపివేస్తున్నారని దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. ఏటిఎస్ సెంటర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 7వ తేదీన ఈ కేంద్రం వద్ద 24 గంటలు ధర్నా చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికులు పెద్ద ఎత్తున వస్తారని సిఐటియు జిల్లా కార్యదర్శి గడ్డం అంకయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలను పాటించని ప్రైవేట్ ట్రావెల్స్‌ను సీజ్

**కావలి, మేజర్‌న్యూస్ :** ఇటీవల కర్నూల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో అనేకమంది ప్రయాణికులు చనిపోవడంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కావలి ఆర్టీవో ఎం. మురళీ కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం కావలి టోల్గేట్ వద్ద ప్రమాణశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి, సీజ్ చేసినట్లు తెలిపారు. బస్ పత్రాలను ప్రయాణికుల సేఫ్టీకి సంబంధించిన నిబంధనలు పాటించినందుకు ఈ బస్సును సీజ్ చేసినట్టు రవాణా శాఖ అధికారి తెలిపారు. ప్రతి ట్రావెల్ బస్సు తప్పనిసరిగా అన్ని నిబంధనలు పాటించాలని ప్రయాణికులకు అసౌకర్యం కలిగించే బస్సులను సీజ్ చేస్తామని రమణ శాఖ అధికారులు తెలిపారు.

# ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి సమీపంలో గృహ నిర్మాణ శాఖ లేఅవుట్లో కేటాయించిన ఇంటి నిర్మాణాలను వారంలోపు పూర్తి చేయాలని ఎంపీడీవో బీ.శ్రీనివాసులు కాంట్రాక్టర్ తమ్మిశెట్టి వెంకటేష్‌కు సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ గృహ నిర్మాణ పనులు దక్కించుకుని నెలలు గడుస్తున్నా వాటిని నిర్మించకపోవడంతో లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నార న్నారు. వారంలోపు నిర్మాణాలు ప్రారంభించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులు ప్రారంభించని పక్షంలో కాంట్రాక్టర్కు కేటాయించిన రూ.58,20,200లు చెల్లించాలన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో కాంట్రాక్టర్కు నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఏ పీరాన్, ఏఈ షరీఫ్, వర్క్ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జలాశయ క్రషర్ గేట్ల పనితీరు పరిశీలన

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం జలాశయ క్రషర్ గేట్ల పనితీరును సోమవారం జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్న మొంథా తుపాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశమున్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తుగా జలాశయ క్రషర్ గేట్లు పనితీరును పరిశీలించడం జరిగిందన్నారు. జలాశయం నాలుగు క్రషర్ గేట్లు పని చేస్తున్నాయన్నారు. ప్రసు తం జలాశయం నీటిమట్టం 11 అడుగులకు చేరిందన్నారు. పైతట్టు ప్రాంతం నుంచి వరద వస్తున్నందున నీటి మ ట్టం పెరిగే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు సురేష్, వేణు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు మాగుంట లేవుట్లో టీ టైం ప్రారంభం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని మాగుంట లేఔట్ శ్రీహరి నగర్‌లో టీ టైమ్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు టీ టైమ్ ఫ్రాంచైజ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. టీ టైంకు మంచి పేరు ఉందని, వ్యాపారం ఉన్నతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నూకరాజు మదన్ కుమార్ రెడ్డి, దాట్ల చక్రవర్ధన్ రెడ్డి టీ టైమ్ ఫ్రాంచైజ్ నిర్వాహకులు బషీర్, ముజ్జు, ఫరాజ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాపరిషత్ అధికారుల సేవలు ప్రశంసనీయం

*(మొదటి పేజీ తరువాయి)*

భారీ వర్షాల కారణంగా డ్రైనేజీలలో నీరు నిల్వ ఉండకుండా పూడికతీత పనులు, డ్రైనేజీల్లో ఉన్న అడ్డంకులను తొలగించడం, అవసరమైతే వర్షపు నీళ్లు వెళ్ళడానికి కొత్తగా కాలువలు తీయడం లాంటి పనులు వేగవంతంగా పూర్తి చేశారు. అన్ని మండలాల్లో మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటూ అన్ని ముందస్తు చర్యలు తీసుకోవడం పట్ల జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాపరిషత్ అధికారులు చేపట్టిన ముందస్తు జాగ్రత్తల వల్ల ప్రజలకు ఉపశమనం కలిగించడమే కాకుండా, విపత్తు ప్రభావాన్ని గణనీయంగా తగ్గించేందుకు దోహదం చేస్తాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అండగా ఉంటూ అధికారులు పనిచేయడం పట్ల కలెక్టర్ వారిని అభినందిస్తూ.. ఇదే స్ఫూర్తితో ఇతర శాఖల అధికారులు విపత్తు సమయానికి ముందు, అనంతరం విధులు నిర్వర్తించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నిరంతర మార్గదర్శకత్వం, సూచనల మేరకు పనులు సమయానికి పూర్తి చేయగలిగామని జిల్లాపరిషత్ సీఈవో మోహన్ రావు తెలిపారు. ఎప్పటికప్పుడు సూచనలు, సమీక్షల ద్వారా ప్రోత్సాహం అందించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# నారాయణ కాన్సెప్ట్ స్కూల్‌లో పేరెంట్ స్టూడెంట్ ప్రోగ్రాం

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని రామలింగాపురం నందుగల నారాయణ కాన్సెప్ట్ స్కూల్లో సోమవారం పేరెంట్ స్టూడెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. 1, 2 వ తరగతి స్టూడెంట్స్ సెగ్మెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఏజీఎం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులు మొదటి టర్మ్‌లో నేర్చుకున్న న్యూమరసి, లిటరసీ, రైమ్స్, స్టోరీస్ వంటి అంశాలను తమ తల్లిదండ్రుల ముందు ప్రదర్శించడం అని తెలియజేశారు. అలాగే పేరెంట్స్ స్వయంగా విద్యార్థులు నేర్చుకున్న పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి, విద్యార్థులు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టిఎల్ఎం) సహాయంతో సమాధానాలు అందించడం అన్నారు. ఈ విధంగా, విద్యార్థులు నేర్చుకున్న విషయాలను సృజనాత్మకంగా ప్రదర్శించగా, తల్లిదండ్రులు కూడా విద్యార్థుల అభ్యాస



ప్రక్రియను దగ్గరగా గమనించే విధంగా అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ స్టూడెంట్స్ పేరెంట్స్ ఇంట్రక్షన్ ప్రోగ్రామ్‌ను సెంట్రల్ ఆఫీస్ నుండి నారాయణ గ్రూప్ డైరెక్టర్ పొంగూరు రమాదేవి నేతృత్వంలో పర్యవేక్షణ బృందం పర్యవేక్షించింది. ఈ కార్యక్రమంలో 1, 2వ తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వెంగళరావు, సోనీ, ఈ ఛామ్స్ వైస్ ప్రిన్సిపాల్స్ వెన్నెల, సల్మ, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ బిందు, ఏవో శివ రంజిత్ పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించారు.

# మాకు న్యాయం చేయండి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలోని తోటపల్లి గూడూరు మండలం కోడూరు పంచాయతీ కి సంబంధించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త యాట శ్రీనివాసులుకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. సోమవారం జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన గ్రామంలో ఒక ఇంటి స్థలం కలదని అయితే అదే గ్రామానికి చెందిన యాట వెంకటరమణయ్య, శంకరయ్య నా స్థలాన్ని ఆక్రమిస్తున్నారని పేర్కొన్నారు. అయితే అక్రమదారులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని చెప్పారు. తన పశువుల పాక కోసం మట్టిని తోలనీయకుండా వారు తనపై దౌర్జన్యానికి దిగారని ఆరోపించారు. తనకున్న ఒక స్థలాన్ని కూడా ఆక్రమణదారులు ఆక్రమించుకునేందుకు దౌర్జన్యానికి దిగుతున్నారని చెప్పారు. అంతేకాకుండా పశువుల పాక వేసినటువంటి గుంజులు కూడా పెరికి వేసి అడ్డపోయిన తనను చంపడానికి ప్రయత్నించారన్నారు. తన గ్రామ నాయకుడు అయినటువంటి వీరబోయిన గంగాధర్ అండ చూసుకు ని ఈ పనులను చేస్తున్నారు. ఈ విషయం పై జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డి, స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో శ్రీనివాసులు, హైమావతిలు పాల్గొన్నారు.

# వాహనదారులకు నష్టం కలిగించే ఏటీఎస్ సెంటర్‌ను రద్దు చేయాలి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండలం కప్పల దరువు గ్రామం వద్ద వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్స్ ప్రైవేట్ ఏజెన్సీలకు ఇస్తూ నిర్మించిన ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టంను రద్దుచేసి ఆర్టిఏ ఆఫీసులో ద్వారానే వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం నెల్లూరు నగర, రూరల్ కమిటీ ల ఆధ్వర్యంలో స్థానిక వి.ఆర్.సి గ్రౌండ్ వద్ద నుండి ఆటో కార్మికులు జోరు వానను సైతం లెక్కచేయకుండా వందలాదిమంది కార్మికులు ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి డిఆర్ఓకి అర్జీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు టీవీవీ ప్రసాద్ సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు రూరల్ అధ్యక్షులు ఎం,సుధాకర్ మాట్లాడుతూ.. ముత్తుకూరు మండలం కప్పలదరువు దగ్గర నిర్మించిన ఏటిఎస్ సెంటర్ వలన వాహనదారులు ఫిట్నెస్ సర్టిఫికెట్లు డ్రైవింగ్ లైసెన్సులు కావాలంటే అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది అన్నారు అంతేకాకుండా డ్రైవింగ్ లైసెన్సులు ఫిట్నెస్ సర్టిఫికెట్లు ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన దాని కారణంగా ఈ మధ్యకాలంలో బస్సులు యాక్సిడెంట్లు కావడం దగ్ధం కావడం తరచుగా జరుగుతున్నాయని వారు అన్నారు. గతంలో జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ డివిజన్లు వారీగా ఆర్టిఏ అధికారులే వాహనాలు తనిఖీ చేసి ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇచ్చేవారని ఇప్పుడు జిల్లా అంతా కలిపి ఒక సెంటరే పెట్టిందాని కారణంగా వాహనాలు రిజిస్ట్రేషన్ కావాలంటే వాహనదారులు దాదాపు వారం రోజులు పాటు వెయిట్ చేయాల్సి వస్తుందని వారు అన్నారు కావున రవాణా రంగ కార్మికులకు నష్టం కలిగించే ఏటిఎస్ సెంటర్లను రద్దుచేసి ఫిట్నెస్ సర్టిఫికెట్లు




డ్రైవింగ్ లైసెన్స్ లను ఆర్టిఏ ఆఫీసుల ద్వారానే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని ఉదృతం చేసి ఏటిఎస్ సెంటర్ల వద్ద 48 గంటలు ధర్నాకు సైతం వెనకాడబోమని వారు హెచ్చరించారు. అనంతరం డిఆర్ఓకి సమస్యలతో కూడిన అర్జీని సమర్పించడం జరిగింది. వారు సానుకూలంగా స్పందిస్తూ ఈ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని వారు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కే సురేష్ ఆటో యూనియన్ నెల్లూరు నగర రూరల్ నాయకులు ఎస్ బాబురావు,ఆర్ రవీంద్ర, పెంచలయ్య, సాంసన్, ప్రేమ్ నివాస్, సురేష్, షేక్ జహీర్, లక్ష్మీపతి, రాజా, వేణు, మోహన్, రవణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ విభాగం అప్రమత్తం

## చీఫ్ జనరల్ మేనేజర్ జె.రమణా దేవి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో, ప్రజల భద్రత కోసం మరియు నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగింపునకు దృష్ట్యా, ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీఎస్‌పీడీసీఎల్) సీఎండీ నెల్లూరు జిల్లాకు జె.రమణాదేవి సిజిఎంని సూపర్‌వైజర్ వీరు వెంటనే తిరుపతి నుండి వచ్చి నెల్లూరు జిల్లాలో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే రమణా దేవి గారు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, నెల్లూరును సందర్శించారు. అక్కడ సూపరింటెండెంట్ మరియు సిబ్బందితో సమావేశమై, తుఫాన్ సమయంలో ఆసుపత్రికి నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగింపునకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎటువంటి అత్యవసర పరిస్థితి ఏర్పడినా, వెంటనే జనరేటర్ విద్యుత్‌ను వినియోగించేందుకు హాస్పిటల్‌లోని జనరేటర్ల స్థితిని పరిశీలించారు. అవి సక్రమంగా పనిచేయేలా ఉంచుకోవాలని, డీజిల్ సరిపడా నిల్వ ఉంచుకోవాలని సూచనలు ఇచ్చారు. తర్వాత ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాని మర్యాద పూర్వకంగా కలిసి, తుఫాన్ నేపథ్యంలో చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు, వంటి టెలికమ్యునికేషన్ టవర్స్‌కు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించమని అన్ని విభాగాధిపతులకు తక్షణమే సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రైవేట్ హాస్పిటల్ కూడ విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందించాలని తెలియచేశారు. తదుపరి ఆమె కోడూరు మరియు మైపాడు వంటి సముద్రతీర ప్రాంతాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. జిల్లా విద్యుత్ అధికారులతో సమావేశమై, తుఫాన్ సమయంలో ఎదురయ్యే విపత్తులను ఎదుర్కోవడానికి పూర్తిగా సిద్ధంగా ఉందని తెలియజేశారు. జిల్లాలో ఇప్పటికే పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, డ్రిల్లింగ్ మిషన్లు, జనరేటర్లు వంటి అవసరమైన సామగ్రి అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ప్రతి డివిజన్‌లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసినట్లు, అలాగే ప్రధాన కంట్రోల్ రూమ్‌ను విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రిల్లింగ్ మిషన్లు, జనరేటర్లు కూడా సిద్ధంగా



ఉన్నాయని తెలిపారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు విద్యుత్ సరఫరా త్వరగా పునరుద్ధరించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రమణా దేవి గారు పేర్కొన్నారు. తీరప్రాంత విద్యుత్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఏదైనా విపత్కర పరిస్థితి తలెత్తితే వెంటనే విద్యుత్ ను పునరుద్ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ బి.జగదీష్, సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం, నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, నెల్లూరు రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమశేఖర్ రెడ్డి, కన్స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరందామయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అశోక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సంసిద్ధం

## అనుమతులు లేని ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు : కమిషనర్ వైఓ నందన్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతి 4 వార్డులకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు వరద ముంపుకు గురయ్యే ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకునేందుకు సంసిద్ధంగా ఉన్నామని కమిషనర్ వైఓ నందన్ తెలియజేశారు. కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కమిషనర్ మాట్లాడారు. ఇంజనీరింగ్, శానిటేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులను ఒక్కో బృందంలో సభ్యులుగా ఏర్పాటు చేసి ఒక్కో బృందంలో పది మంది సహాయకులను నియమించామని తెలిపారు. బృందాలతో భారీ వర్షాలకు వరద ముంపు ప్రాంతాలను గుర్తించి వరద నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలను తీసుకునేందుకు సంసిద్ధం చేశామని తెలిపారు. నగరపాలక సంస్థ మున్సిపల్ పాఠశాలల్లో 14 వరద సహాయక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, వరద ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన అన్ని వసతులను కేంద్రాలలో కల్పించనున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. పట్టణ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఆలోచనల మేరకు వార్డు సచివాలయ కార్యదర్శులు అందరూ సహాయక చర్యల్లో పాల్గొనేందుకు సంసిద్ధంగా ఉన్నారని, సచివాలయం పరిధిలో అడ్మిన్ కార్యదర్శి నేతృత్వంలో సహాయక చర్యలు అందించనున్నారని కమిషనర్ తెలిపారు. మంత్రి పి.నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిల ఆలోచనలతో ఈ ఏడాది ఆగస్టు నెల నుంచి ప్రారంభించిన డ్రైను కాలువల పూడికతీత పనుల వలన నగరవ్యాప్తంగా వర్షపు నీరు ఎక్కడ నిల్వ ఉండకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని కమిషనర్ తెలిపారు. భారీ వర్షాలకు సైతం వరద నీరు సాఫీగా ప్రవహించేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. తుఫాను నేపథ్యంలో వరద ప్రభావానికి గురైై ప్రజలకు అవసరమైన సహాయక చర్యలను అందించేందుకు నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ భాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్లు 0861- 2356777, 0861- 2316777 నెంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందగలరని కమిషనర్ సూచించారు.



# తుఫాన్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



## ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మొంథా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. తుఫాన్ నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఆయన పొదలకూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. మొగళ్లూరు, అంకుపల్లి, పులికల్లు, పర్వతాపురం గ్రామాల ప్రజలను పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తుఫాన్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. వరద ప్రవాహం వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. తాను కూడా ప్రజలకు ఎల్ల వేళలా అందుబాటులో ఉంటానని ఏ క్షణం అవసరమైన తనను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ శివ కృష్ణయ్య ఎంపీడీవో నరసింహారావు పిఎసిఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, మండల తెలుగు యువత అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ అక్కెమ్ సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు పులిపాటి వెంకటరత్నం నాయుడు, రావుల సంపత్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సుందరేశ్వర స్వామి వారి కార్తీక శోభ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం, దుర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ప్రతిష్ఠగా వించబడిన శ్రీ మీనాక్షిసమేత శ్రీ సుందరేశ్వర స్వామి వారి దేవస్థానం నందు మొదటి కార్తీక సోమవారం సందర్భంగా సోమవారం శ్రీ స్వామి వారికి 108 బిందెలతో అభిషేకం, వివిధ రకాల పండ్లతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు ప్రధాన అర్చకులు, వేదపండితులు, అర్చకల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. పై కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించుట జరిగింది. సాయంత్రం అధిక సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించడం జరిగింది. అనంతరం రాత్రి 7.30 గంటలకు కుంభ హారతులు జరిగినవి. పై కార్యక్రమములో ఆలయ సహాయకమీషనర్ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్థలం చదును చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని మెయిన్ స్కూల్కు సమీపంలో ఉన్న పాత రెవెన్యూ భవనాన్ని కూలగొట్టి స్థలాన్ని చదును చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం పట్టణానికి చెందిన పలువురు తహసీల్దారు ఎల్.రామ్మోహన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. పూర్వం ఆ భవనంలో రెవెన్యూ ఉద్యోగులు కార్యకలాపాలు నిర్వహించేవారన్నారు. ఆ స్థలాన్ని కొందరు ఎక్స్కవేటర్ సహాయంతో కూలగొట్టి చదును చేయడం దారుణమన్నారు. భవిష్యత్తులో పట్టణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్థలాన్ని కాపాడాలన్నారు. భవనాన్ని కూలగొట్టి స్థలాన్ని చదును చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. స్పందించిన తహసీల్దారు స్థలం చదును విషయంపై ఇప్పటికే పోలీసులకు పిర్యాదు చేశామని సూచించారు.

## అత్యంత వైభవంగా కార్తీక సోమవారం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కార్తీక మాసం పరమశివుడికి, శ్రీమహా విష్ణువుకు ప్రీతి పాత్రమైన మాసం. ఈ మాసంలో సోమవారానికి మరింత విశిష్టత ఉంటుంది, దీనిని శివారాధనకు అత్యంత ముఖ్యమైన రోజుగా భావిస్తారు. కార్తీక సోమవారం రోజున నెల్లూరు శివాలయాల్లో భక్తులు తెల్లవారు నుంచే స్వామి అమ్మవార్ల దర్శనానికి బారులు తీరారు. సోమవారం మూలస్థానేశ్వర ఆలయానికి భక్తులు విశేషంగా తరలి వచ్చారు. ఉపవాసం, దీపారాధన, నదీ స్నానం, దానధర్మాలు చేయడం వలన సకల పాపాల నుండి విముక్తి, మోక్షం లభిస్తాయని విశ్వాసం.కొందరు పండితులు ఈ రోజు చేసే పూజకు 'కోటి సోమవారాల' పుణ్యఫలం లభిస్తుందని చెబుతారు.భక్తులు పవిత్ర స్నానం ఆచరించి శివాలయాన్ని దర్శించి, పరమేశ్వరుడికి అభిషేకం, బిల్వార్చన చేసారు.రోజు మొత్తం ఉపవాసం పాటించి దీపాలు వెలిగిస్తూ భక్తులు పరవశించిపోయారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు అని ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వ భూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

## కార్తీక మాసం మొదటి సోమవారం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జొన్నవాడ క్షేత్రం శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం నందు కార్తీక మాసం సందర్భంగా ఉదయం శ్రీ స్వామి వారి మూలవర్లుకు ఆలయ అర్చకులు వేద పండితుల మంత్రోచ్చారణతో అన్నాభిషేకం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేక కార్యక్రమాన్ని తిలకించారు. జొన్నవాడ వాస్తవ్యులు బుర్లా కుమార్ ప్రసాద్ రెడ్డి, మాధురి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, సహాయ కమిషనర్ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, పాలక మండలి సభ్యులు భక్తులకు దర్శన క్యూలైన్లు, ఉచిత ప్రసాద వితరణ, అన్న ప్రసాద వితరణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉదయం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకములు, పాలాభిషేకాలు జరిపించారు. సాయంత్రం చిన్న వెండి నంది వాహనం పై శ్రీ స్వామి వారు పల్లకీ సేవ ప్రాకారోత్సవం లో భక్తులకు దర్శనమిచ్చారు.

## తుఫాను కారణంగా ఇంటర్వ్యూలు వాయిదా



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో అక్టోబర్ 28న జరగాల్సిన వాక్-ఇన్ ఇంటర్వ్యూలను తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అక్టోబర్ 30కి వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ డా. కె.సునీత తెలిపారు. కావలి క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, నాన్-టీచింగ్ ఖాళీల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు జరుగనున్నాయి. అభ్యర్థులు శ్రీపొట్టి శ్రీరాములు భవనంలో సర్టిఫికేట్లతో హాజరుకావాలని సూచించారు.

## శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని శివాలయాలు కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా శివనామస్మరణతో మార్మోగాయి. పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయంతోపాటు మండలంలోని గండిపాళెం, అప్పసముద్రం, గుడినరవ, లింగాలదొనక్షేత్రం, యర్రబల్లిగడ్డ, ఆర్లపడియ గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు భారీసంఖ్యలో చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీకదీపాలు వెలిగించారు. అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.